అయితే పాపము! లలిత గతేమిటి?

శ్రీమతి క. వరలక్ష్మమ్మగారు

౧

జగన్నాథం రాత్రి మెయిలులో యింటికి వచ్చాడు.

తెల్లవారుజామునసే మొదలు పెట్టింది తల్లి "నాయనా నీకు మళ్లీ పెళ్లి చేస్తానురా" అని. జగన్నాథం ఆమాట విని ఉలికిపడి "ఇదేమిటే అమ్మా" పెండ్లి అయినవాడికి పెండ్లి చేస్తానంటావు?" అన్నాడు.

"వాళ్ల తరహా యేమీ బాగాలేదు."

"ఏమి?"

"ఆపిల్లను ఇంగ్లీషు చదువుకోసం విశాఖపట్నం పంపారుట. ఇక ఆవిడ ఎప్పే బియ్యే అయ్యే దెప్పటికో, యింటికొచ్చే దెప్పటికో"

"పోనీ! నేనూ చదువుకుంటున్నానుగా! నా చదువింకా నాలుగేళ్లున్నది. ఈలోపల ఆపిల్లా చదువుకుంటుంది. ఇంట్లో ఉండి ఏమిచెయ్యాలె?"

"అదీసరస. మీ మగకుంకలకు ఇట్లాంటి బుద్ధులు పుట్టబట్టే వాళ్ల కట్లా పొయ్యేకాలం వచ్చింది. లేకపోతే పెండ్లయి ఈడేరిన పిల్లను యెవరట్లా సాహసించి చదువుకోసం పొరుగూరు పంపుతారు? నాలుగేండ్లు నీవు చదువుకుంటూఉంటేమాత్రం ఆవిడకూడా చదువుకోవలెనా? పెద్దదాన్ని రేపులుమాపులు చేసుకోలేక చస్తున్నానుగదా, ఆమెుక్క కాస్తా తీర్చుకొని యింట్లో తీసుకొచ్చి పడేసుకుంటే కాస్త చేతికి ఆసరాగా ఉండదూ. ఏదీ లేదాయె, పైగా నీవే, 'చదువుకుంటే— ఏమీ' అంటూ ఉంటివి."

"అయితే యేమంటావు?"

"అది నిన్ను మించి చదువుకుంటే అసలు నీకు లొంగుతుందా? అంట."

"అయితే చదివించవద్దని వాళ్లకు వ్రాయించక పోయినావా?"

"వ్రాయించలేదనుకున్నావా? మీనాన్నగారేగా ఉత్తరాలు వ్రాసింది? మాయింట ఆడవాళ్లు చదువుకునే ఆచారంలేదనీ, మాకోడలును చదువుకోసం పొరుగూరు పంపవద్దనీ, మామాట వినకుండా పంపితే అందువల్ల వచ్చే కష్టాలకు మీరే బాధ్యులౌతారనీ యెన్నెన్నివిధాలో వ్రాశారు. వ్రాస్తేమాత్రం ఏమి."

"ఏమీ? దానికి జబాబు వ్రాయలేదూ?"

"ఆఁ వ్రాశారు, ఒకమాటు పిల్ల చదవాలని కుతూహలపడుతున్నదనీ, ఒకమాటు తల్లి కూతురును చదివించాలని సరదాపడుతున్నదనీ, ఏవేవో వంకరజవాబులు మీ మామగారు వ్రాశాడు. అయినా ఆయనమాత్రం ఏమి చేస్తాడు? ఆయన వట్టి డూడూబసవన్న. పెళ్లామూ, కూతురూ ఎట్లాచెప్పితే అట్లా. ఆయనకో అధికారం యేడిస్తేగా? ఆతల్లిబిడ్డల్లోనే ఉన్నది, కుట్రంతా. మళ్లీ మీ నాన్నగారు వ్రాసిన ఉత్తరానికి జబాబు లేకపోతే యింకా చదువుకు పంపడం మానుకున్నారేమోనని సంతోషిస్తున్నా. మొన్న సాంబశివరావుగారి మేనగోడలు, అధీనంతప్పినపిల్ల విశాఖపట్నంలో చదువుతున్నదే, అది వచ్చి 'మీకోడలు మాస్కూల్లో చదువుతున్నదో'అన్నది, వాళ్లింటికి పోతే. పుటిక్కిన నలుగురిలోను నాకు తల గొట్టినట్లయింది. వాళ్లంటే సంపాదించిపెట్టే మొగుడు పోయినాడుగనుక చేసేదేమీ లేక చదువుకుంటున్నారు. దీని కేమికర్మం వచ్చిందని చదువుకోడం. లక్షణంగా అత్తా, మామా, పెనిమిటీ ఇంతకలిగిన కాపురంగదా. ఏమిలేక యీప్రారబ్ధం?"

"వాళ్లు చేసినపని తెలివితక్కువపనే అనుకో. అయితే యిప్పు డేమి చేస్తాము?"

"చేసే దేమున్నదీ? దీని కొక్కటే మందు."

"ఏమి మందు?"

"మొదటనే చెప్పితినిగా! నీకు మళ్లీ పెళ్లిచేస్తాము"

“సరిసరి; బా గున్నది. చదువుకుంటున్నదని పెళ్లి, సంగీతం నేర్చుకుంటున్నదని పెండ్లి, ఆడుకుంటున్నదని పెండ్లి, పాడుకుంటున్నదని పెండ్లి, అందంగా లేదని పెండ్లి, చదువుకు సాయంచేయ లేదని పెండి, ఇదేనా పని? కాస్తకు కూస్తకూ పెండ్లాన్ని వదిలిపెట్టి పెండ్లి చేసుకోడమేనా?”

“నీవెక్కిరింపులూ, కొక్కిరింపులూ పనికిరావబ్బాయి. ఆపెండ్లాము వచ్చి నీకేమైనా వరిగిస్తుందని అనుకుంటున్నావేమో! అది వట్టిమాట. ఒకవేళ ఆపిల్ల వస్తానన్నా ఆతల్లి రానియ్యదు. ఒకవేళ వచ్చినా ఆ తల్లి మిమ్మల్ని సుఖంగా ఉండనియ్యదు. ఆవిడ యెటువంటి దనుకున్నావు, యేమికథ? పెండ్లిలో చూడలేదూ? ఒక్కమాటూ సరిగా భోజనానికి పిలువక ఒక్కవేడుకా సరిగా జరపక ఒక్కలాంఛనము సరిగా యివ్వక యెట్లా చేసిందో!”

“మనంమాత్రం వారిని సరిగా జరపనిచ్చామూ? వియ్యపురాళ్లిద్దఱూ డీ అంటే డీ అని ముచ్చటగా జరగాలిసిన పెండ్లి ఆగాలతో బోగాలతో అల్లరి హంగామా చేశారు?”

“అదిగో నీ కుండే తెగు లదే! పేడా బెల్లం కలుపుతావు. నేను అల్లరి చేశానూ? మీ నాన్నను అడుగుదా ముండూ. ఏమండీ, అబ్బాయి పెండ్లిలో తగాదాలు పెట్టిం దెవరు?” అని కళ్ల నీళ్ల పర్యంతమై గాఢనిద్రలో ఉన్న రాఘవయ్యగారిని లేపడానికి సిద్ధమైంది, కాంతమ్మ.

“అబ్బా యేమిటమ్మా! మాటకుమాట సమాధానమియ్యాలెగాని హాయిగా నిద్రబోతున్న నాన్నను లేపబోతా వెందుకు? ప్రత్యక్షంగా చూచినదానికి సాక్ష్యంతో పనేమిటి?” అని తిన్నగా తల్లిని కొప్పడి తండ్రిని లేపకుండా అడ్డగించాడు జగన్నాథం.

“లేకపోతే ‘ఒక్కగానొక్క బిడ్డే, అయ్యో, వీడికిటువంటి భార్యా, అత్తగారూ దాపురించిరే! ఏమిరా స్వామీ! విచారించి విచారించి ఆఖరు కిట్టి భ్రష్టాకారపు సంబంధం చేస్తిమి. ఒక్క అచ్చటా ముచ్చటా జరగకపోయెనే, ఏమిరా స్వామీ’ అని నేను రాత్రిం బగళ్లు యేడుస్తుంటే నీవు ఆవిడకూ నాకూ పోల్కి దెచ్చి కాలిచచ్చేమాట లంటావా? నాకుమాత్రం నిన్నగాక మొన్న రెండుసంచులు పోసి పెండ్లిచేసి మళ్లీ చేయడం సంబరమా? ఆపిల్ల నట్లా చదువుకు పంపడం, ఎంత గొప్ప పండుగలు వచ్చినా యెన్నాళ్లు సెలవులువచ్చినా అత్తవారని ముచ్చటగా పిలుచుకుపోవడం, బట్టా పోతా పెట్టడం, అల్లుడని అపేక్షపడడం, ఏమీ లేకపోవడం చూచి మనస్సులో యెంత మఱిగిపోతున్నానో నీ కేమి తెలుసు? కడుపు కన్నం, కంటికి కూరుక్క యెఱుగను. ఈ మాయసంబంధం యేమని వచ్చిందో! నే నిట్లా అల్లాడుతుంటే పైగా నీమాట లివా?”

కాంతమ్మ కండ్ల నీళ్లు బలబలా కార్చింది. ఈమహాస్త్రప్రయోగంతో జగన్నాథం నిరుత్తరుడైనాడు. భూమ్యాకాశాలను బ్రద్దలు చేసే యేదో మహా సంక్షోభంలో నిలిచిపోయింది అతనిమనస్సు. రెండు చేతులతో తల గట్టిగా పట్టుకొని మంచంమీద వెల్లకిలా బడ్డాడు.

౨

తనతండ్రి కేవలం నెలకు ౫౦ రూపాయల వేతనం గల మున్సబుకోర్టుగుమాస్తా. తాను గొప్ప ఆస్తి గలవాడని భావించుటకూ, తాను ఉన్నతవిద్య నభ్యసించుటకూ, తనకు హెచ్చుగొత్తము కట్నముగా వచ్చుటకూ, యే ఆస్తి అయితే ఉన్నదో అది తల్లిది. పుట్టినింటివా రెవరూ లేనికారణంచేత తండ్రి ఆస్తిఅంతా కాంతమ్మకు వచ్చివేసింది. కాబట్టి తనతల్లికి వ్యతిరేకించడం అంటే ఆస్తికి నీళ్లు వదులుకోడం అన్నమాట. వదులుకొని యేమిచేయడము? చదువు అసంపూర్తిగా ఉన్నది. చేతిలో కానీ లేదు. నేను మళ్లీ పెళ్లిచేసుకోనూ అంటే ‘పోండి, నీవూ, నీభార్యా ఎట్లా బ్రతుకుతారో బ్రతకండి’ అంటుంది. మహాపెంకెపట్టుదల గలది. ఆమెకు అంతటా చెల్లవలసినది తనఆజ్ఞా, తన అధికారంగాని, వేఱేమీ కాదు. దీనికి వ్యతిరేకం చేసిరా పెనిమిటికాని, కొమారుడుగాని మఱెవ్వరుగాని

నెత్తిమీద చేబ వేసికొని పోవలసినదే! తల్లి యొక్క స్వభావం, ఆమె అధీనమైయున్న ఆస్తిపాస్తుల విషయం సమస్తము తెలిసినవాడగుటచేత యేంచేస్తునా అని ఆలోచనాసాగరంలో మునిగిపోయినాడు జగన్నాథం. తనకున్న ఆస్తిచేత తన్నూ, తండ్రిని, బానిసల క్రింద కొనేసుకున్నది తన అమ్మ. ఈఅధికారంక్రింద జీవించడం యెంత దుస్సహంగా ఉన్నదో అంత అవిలంఘనీయంగా ఉన్నది. కనుకనే యెంతయోచించినా ఆతని యోచన తీరమునుచేరలేదు. అబ్బా! ఈ సెలవులకు యింటికి రాకుండా ఉండకపోతినే. ఈవేదనచేత తల పేలిపోయేటట్లున్నదే అని అనుకున్నాడు కాని అక్కడున్నా రావలసిందని తల్లి వద్దనుండి తాఖీదు వచ్చినట్లయితే తత్క్షణం రావలసిందేగా అని తోచినప్పుడు తన నిస్సహాయత బాగా గోచరమైంది జగన్నాథానికి. ఈతెంపులేని యోచనలో మూడుదినాలు గడచిపోయినాయి. 'ఆపిల్ల అభిప్రాయమైనా తెలుసుకోకుండా పెండ్లాడటం నా కిష్టంలేదు. విశాఖపట్నంవెళ్లి ఆఅమ్మాయితో మాట్లాడి తీసుకొనిరావడానికి ప్రయత్నిస్తాను. ఆపిల్ల వస్తే తీసుకొస్తాను. రాకపోతే అప్పుడు ఆలోచిద్దా' మని కొంచెం మొండిధైర్యంతో గట్టిగా యెదిరించాడు తల్లిని జగన్నాథం. చాలాకాలంనుంచీ ప్రబల శత్రువుగా ఉన్నవాడు తన అధీనమౌతాడంటే వాడిపై కసిదీర్చుకోవచ్చునని సంతోషబడినట్టుగా, కోడలే తన యింటికి తనకుదానై వచ్చినట్లయితే ఆపిల్లనూ, తల్లినీ గూడా బాగా బాధించి కసితీర్చుకోవచ్చునను ఆశతో కాంతమ్మ ఒప్పుకున్నది. నరమాంసాశనులు నరరక్తభోజులు అంటూఉంటే చాలామంది అనుకుంటూ ఉంటారు: ఒకమనుష్యుడిని తీసుకొచ్చి వాడిని కోసి వాడిరక్తం త్రాగి వాడిమాంసం ముక్కలుక్రింద చేసుకొని తినేవాళ్లని. అది చాలా పొరబాటు. ఎవరైతే తమ నిర్దయాత్మకమైన ప్రవర్తనవల్ల యితరుల మనస్సును క్షోభపెట్టి వాళ్ల రక్తమాంసాలను శుష్కింపజేస్తున్నారో వారే మానవభోజులు. ఆహారంక్రింద ఒక ప్రాణిని ఉపయోగించేవాళ్లల్లో దయారసం ఉంటుంది. కాని వీళ్లకు ఉండదు.

3

జగన్నాథం చివర కెట్లాగో విశాఖపట్నం వెళ్లి హాస్టలు మేనేజరమ్మగారికి వ్రాసి మధ్యాహ్నం ఒకటిన్నర రెండున్నరగంటలమధ్య లలితతో మాట్లాడవలసినట్టుగా ఉత్తరువు పొందినాడు. ఆ ఉత్తరువు యిస్తూనే మేనేజరమ్మగారు లలితను పిలిచి చెప్పింది. "లలితా! నీభర్త మధ్యాహ్నం వచ్చి నీతో యేమో మాట్లాడుతాడట. కనుక ఎండ అని స్కూలులోనే ఉండిపోక హాస్టలుకు రా." అని. చక్కని నందనోద్యానంలో హేలగా ఆడుకుంటున్న లేడికి ఎక్కడినుంచో ఆకస్మికంగా బాణం వచ్చి గ్రుచ్చికొన్నట్లయింది, లలిత కావర్తమానం. వెనకకు పోలేదు. ముందుకు రాలేదు. అక్కడ నిలబడలేదు. గుండెలలో యేదో అదురు పుట్టింది. సీలలుతీసిన యంత్రంలాగు అవయవాలన్నీ కుప్పబడిపోవటం మొదలుపెట్టినవి. అతిప్రయత్నంమీద తిన్నగా మేనేజరమ్మగారి యెదుటినుండి చాటుకు వచ్చింది. కాని ఆ అదురు, ఆ విహ్వలత పోలేదు. ఆరోజున అన్నము అటిగొటి, బడిలో పాఠాలు పూజ్యము, అత్తవారినిగూర్చి తాను విన్నవిషయాలు, పెండ్లిలో తానుచూచిన విషయాలు, జరుగబోయేదాన్నిగూర్చి తాను ఊహించుకుంటున్న విషయాలు, అన్నిటినీ అన్నిరంగులుగా చేసికొని కల్పనాబలంచేత గొప్ప భయానకభీభత్సచిత్రాలను రచిస్తున్నది ఆమెమనస్సు. ఆపటాలను చూచి హడలిపోతూ గడపివేస్తున్నది ఆపగలును లలిత. బడిని విడిచే గంట కొట్టారు. భయం భయంతో లలిత హాస్టలుకు వచ్చింది. గేటుకు ప్రక్కగానే ఇతరులు వచ్చినప్పుడు మాట్లాడడానికి యేర్పడి ఉన్న గదిలో కూర్చుండి ఉన్న మేనేజరమ్మగారు 'లలితా!' అని పిలిచింది. జింకపిల్లలాగు బెదరిబెదరి చూస్తూ లలిత గదిలోకి వెళ్లి మేనేజరమ్మగారి కుర్చీ నానుకొని తల వంచి నిలుచున్నది. విశాలమైన ముఖము, పలుచని చెక్కిళ్లు, నమ్రతచేతా సిగ్గుచేతా అరమోడ్పులై ఉన్న చక్కని కన్నులు, నిడుపైన వాలుజడ, అందులో లలిత ముఖ కమలమువలెనే వసివాడియున్న గులాబిపువ్వు,

మనస్సులో ఉన్న భయంచేతా, ఎదుట భర్తను చూడడం చేతా పిల్లగాడ్పులకు తూగాడు వల్లరివలె కంపించు తనూలత కలిగి మధురమధురముగా నున్న లలితనుచూచి పులకితుడైనాడు జగన్నాథం. నేను బోయి ఆ అమ్మాయిని చూచి మాట్లాడి ఆ అమ్మాయి కాదంటేనే తప్ప నేను మళ్లీ పెళ్లి చేసుకోనని తల్లితో పోరాడి వచ్చాడు కాని ఇక్కడ లలితతో యేమి మాట్లాడవలెనో అతనికి బోధపడలేదు. కేవలము ఆమె లావణ్యారసం నేత్రేంద్రియాలతో పానంచేస్తూ కూర్చున్నాడు. ఈచిత్రప్రతిమలను రెంటినీ యెదుట బెట్టుకొని కూర్చోడానికి మేనేజరమ్మగారికి ఓపిక లేకపోయింది. "ఏమండీ! యేమి మాట్లాడడానికి వచ్చారు? మళ్లీ ఆ అమ్మాయి బడికి వెళ్లవలసి ఉంటుం" దన్నది ఆమె.

"చిత్తము, నాకు తెలుసును. ఒకమాటు ఒంటరిగా", అని గొణిగాడు జగన్నాథం. "ఆఁ ఆఁ, వల్లగాదు. హాస్టలు బాలికలతో ఒంటరిగా మాట్లాడుటకు మా రూల్సులు ఒప్పుకోవు. సంభాషణ నాసమక్షముననే జరుగవలెను." జగన్నాథం ఇక చేయునది లేక "లలితా!" అన్నాడు కంపితస్వరముతో. లలిత కన్నెత్తి ఆతనివంక చూచి మళ్లీ కన్నులు వాల్చుకున్నది.

"లలితా! నీ విట్లా పొరుగూరు వచ్చి చదువుకోడం మావాళ్ల కిష్టంలేదు." అన్నాడు జగన్నాథం. లలిత సిగ్గుచేత జవాబుచెప్పలేదు. తల మఱీ నేలకు వంచుకున్నది.

"జవాబుచెప్పు లలితా! మొగుడితో మాట్లాడడానికి సిగ్గేమి" టన్నది, నవ్వుతూ, మేనేజరమ్మగారు. లలితసిగ్గు రెట్టింపైంది.

"ఎక్కువ మాట్లాడడానికి అవకాశం లేదు. మాఅమ్మ నీవు చదువుకోడానికి ఏమాత్రం ఒప్పుకోడం లేదు. నీ వెందుకు చదువుకుంటున్నావు?" అన్నాడు జగన్నాథం మళ్లీ. జవాబుచెప్పక తప్పలేదు. "మా అమ్మా, నాన్నా పంపారు. నాకేమి తెలుసు?" అన్నది లలిత.

"అవును, నాకు తెలుసు. మీతల్లిదండ్రులుచేసిన పాడుపనే యిది. అయినా మించిపోయిన దేమీ లేదు. ఈచదువు మానేయి."

"మానాన్నగారికి వ్రాస్తాను. వారు మానేయమంటే అట్లాగే మానేస్తాను."

"మీతల్లిదండ్రులు నీచదువు మానిపించరు. వాళ్ల నీక్షేమం చూడటం లేదు. నీవైనా నీక్షేమం చూచుకో తలుచుకుంటే చదువుమానుకో."

"తల్లిదండ్రులకంటే క్షేమంచూచేవా రెవరు?"

"అది పొరబాటభిప్రాయం. నీమంచి కోరేవాళ్లయితే, మా నాన్నగారు మాకోడలిని పొరుగూరు చదువునిమిత్తంపంపవద్దని వెయ్యివిధాల వ్రాస్తే వారిమాట పెడచెవిని బెట్టి యీవిధంగా నిన్ను పంపుతారా?"

"నా కా సంగతులన్నీ తెలియవు."

"తెలియవు కనుకనే చెప్తున్నా".

"ఏమిటి?"

"నీ వీచదువు మానెయ్యి."

"మాని?"

"నాతోటి మాయింటికి రా?"

"..............................."

"ఇప్పుడు నీ జీవితంలో చదువుకూ, సంసారానికీ పోటీ వచ్చింది. చదువువదలి సంసారం తీసుకుంటావో, సంసారం వదిలి చదువు తీసుకుంటావో యోచించుకో."

"రెండూ యెందుకు ఉండరాదూ?"

"అది పొసగదు. ఏదో భర్తలేనివాళ్లూ, భర్తను వదిలిపెట్టినవాళ్లూ, జీవనోపాధిలేనివాళ్లూ చదువుకుంటారు. నీ కెందు కీతిప్పలు?"

"అయితే మావాళ్లెందుకు పంపారు?"

"అదే మీవాళ్లు చేసిన బుద్ధితక్కువపని."

లలిత నేత్రాల్లో లాలిత్యం పోయి యెఱ్ఱబడ్డాయి. జగన్నాథంవంక తీక్ష్ణంగా చూచింది.

"అవును, మీవాళ్లనంటే నీకు కోపంగానే ఉండవచ్చు కాని, మీవాళ్లు చేసినపనిమాత్రం సరసమైంది కాదు."

"కోమాత్రైనా చదివించడం పనికిమాలిన పనా?"

"వాళ్ల అత్తవారికి ఇష్టంలేనప్పుడు చదివించడం పనికిమాలిన పనే. అయితే, అయిపోయినదానికి చేసేదేమిటి? నేచెప్పినమాట ఏమన్నావు?"

"ఏమిటి?"

"నాతోటి వస్తావా?"

"మాతల్లిదండ్రులు పంపితే వస్తా."

"పంపకపోతే రావా?"

"..........................."

"విన్నావా? మాఅమ్మ నాకు మళ్లీ పెండ్లిచేయడానికి సర్వం సిద్ధంచేసుకొని కూర్చున్నది. నేనెట్లాగైనా నీతో మాట్లాడి నిన్ను తీసుకొనిపోయి రక్షిద్దామని మాఅమ్మతో పోట్లాడి వచ్చాను. నాకేమి, నేను మళ్లీ పెండ్లిచేసుకుంటా. నీజీవితమే వ్యర్థమైపోతుంది. నేనిక నిన్ను తలపెట్టను. నీస్థానం మఱొకరాక్రమిస్తారు. పురుషుడిచిత్తం నీకు తెలియదు. ప్రత్యక్షసౌఖ్యాలను వదిలిపెట్టుకొని ఎవరికోసమో ప్రతీక్షిస్తూ కూర్చొనే ఓర్పు మొగవాడికి లేదు. అన్నివిధాలా స్వాతంత్ర్యంఉన్న మగవాడు తన స్వాతంత్ర్యం అన్నిమార్గాలా అనుభవించాలనే చూస్తాడుగాని, ఇంకో ఆలోచన చేయడు."

లలితకన్నులు నీళ్లతో నిండినాయి. ఒకటి రెండు చుక్కలు ఆపుకున్నా ఆగక నేలమీద పడ్డవి. జగన్నాథం చూచాడు. "వట్టివట్టియేడ్పులతో లాభం లేదు. ఇప్పుడు కావలసింది, పనీ" అన్నాడు.

పదునాలుగేండ్లు వెళ్లీవెళ్లని బాల. తల్లిదండ్రులను ధిక్కరించి మొగడితోటి వెళ్లాలె. రమ్మనేమొగవాడికి ఈవిషయము చాలసులభమైనదిగానే తోచవచ్చును. ఆలా తనవెంట రాకపోయినట్లయితే ఆపిల్ల చాలా అవిధేయురాలు, అయోగ్యురాలు అనేతలంపు గూడా కలుగవచ్చును. కాని నిదానంగా ఆలోచిస్తే ఇందులో పురుషుడి దౌర్జన్యమే అధికంగా గోచరిస్తుంది. తల్లిదండ్రులచాటున పెరుగుచు అభము, శుభము యెఱుగకుండాఉన్న పిల్లను అథాటుగా వచ్చి 'మాయింటికి నాతో రా' అంటే అత్తవారియింటికి వెళ్లితే తన స్థితి ఎట్లా ఉంటుందో? అత్తగారేమి చేస్తుందో? మొగుడేమి అంటాడో? ఈమాట విని తలిదండ్రు లేమనుకుంటారో? తన్ను మళ్లీ తలిదండ్రులను చూడనిస్తారో, లేదో? ఈవిధంగా చెప్పకుండా వెళ్లినదాన్ని అసలు తలిదండ్రులు తలపెట్టుతారో, లేదో? ప్రేమాస్పదులయిన తల్లిదండ్రులను వదులుకొని రాపాడే అత్తగారివద్ద చేరితే తనస్థితి యెట్లా ఉంటుందో? ఇవన్నీ బాలిక హృదయంలో కలతపెట్టే విషయాలేగా! అయితే భార్య అనేది ఎప్పుడు, ఎక్కడ నిలబడి మగడు 'నాతో రా' అంటే రావడానికి సిద్ధంగా ఉండాలిసిందే అనీ, ఆవిధంగా తీసుకొనిపొయ్యే మహాధికారం తనకు గలదనీ మహాగర్వంతో ఉన్న జగన్నాథం యివన్నీ ఆలోచించలేదు "ఏమి వస్తావా, నాతోటి యివ్వాళ" అన్నాడు.

"మాతల్లిదండ్రులు పంపితే వస్తా" నన్నది, తిన్నగా, లలిత గడగడ వణుకుతూ. "ఛీ, నీ కర్మం నీది. వృథాగా యేడ్చిపోతావని యెన్నివిధాల చూచినా నీకు బుద్ధిలేకుండా ఉన్న" దని చివాలున లేచాడు, జగన్నాథం కుర్చీమీదనుంచీ.

"అవునండీ, చిన్నపిల్ల, తల్లిదండ్రులు పంపితే వచ్చి చదువుకుంటున్న పిల్ల. వాళ్లకు తెలియకుండా మీ రెక్కడో అర్థాంతరంగా వచ్చి నిలుచున్నదాన్ని నిలుచున్నట్టుగా నాతో రమ్మంటే ఎట్లా వస్తుంది? వెళ్లి మీమామగారితో మాట్లాడండి. మీ అభిప్రాయం తెలియజెప్పండి. వారు పంపితే లక్షణంగా తీసుకొనిపొండి. అదీ సబబు" అన్నది మేనేజరమ్మగారు.

"నా కెన్నూ. ఆదౌర్భాగ్యులతో నాకు అవసరం లేదు. ఈపిల్ల వస్తే తీసుకపోతా, అంతే."

తన తల్లిదండ్రులను తీవ్రంగా దూషిస్తూ తన్ను బలాత్కారంగా యూపపశువును లాక్కుబోయినట్టు లాక్కుబోతానంటూ ఉండే భర్తలో ఉన్న అసురత్వం గుర్తించి గడగడలాడిపోయి మేనేజరమ్మగారిని మఱింత ఆనుకొని బెదరిబెదరి చూస్తూ నిలబడ్డది లలిత.

“ఏమి, వెళ్లుతున్నా. వస్తావా, రావా? ఏదో మాట తేల్చిచెప్పు” అన్నాడు జగన్నాథం, తీవ్ర స్వరంతో. లలిత మాట్లాడలేదు. పెండ్లయినదిమొదలు తమకూ, తమ అత్తవారికీ జరుగుచున్న సంఘర్షణవల్ల భర్తన్నా, భర్తగృహమన్నా బాలికలకు సహజంగా గలిగే అనురాగం, అభిలాషా లలితహృదయంలో వట్టిపోయింది. అత్తవారూ అంటే ఏదో ఒళ్లు జలదరించే అవ్యక్తపు భయ మేదో మనస్సును ఆవరించిపోయింది. నేడు జగన్నాథంగద్దరింపులు ఆ అవ్యక్తరూపానికి రూపం ప్రసాదించినవి. కనుక “యేమి, వస్తావా, రావా? తేల్చిచెప్పూ” అంటే యేమీ తేల్చలేకపోయింది, లలిత. ఒకటికి రెండుమాట్లడిగినా జబాబు చెప్పకపోవడంచేత తన భర్తృత్వాధికారమనే వాడికత్తి మొక్కబోయినట్లయి కోపంతో మండిపోతూ జగన్నాథం, “ఊఁ, నీవుమాత్రం నీతల్లిబిడ్డవుకామూ, మాఅమ్మ చెప్పినట్టు. నీకు తగినశాస్తి చేసితీరుతాలే” అంటూ లలితవంక తీవ్రంగా చూస్తూ వెళ్లిపోయినాడు.

లలిత మేనేజరమ్మగారిని కౌగిలించుకొని బావురుమని యేడ్చింది. పాపం మేనేజరమ్మగారి మనస్సు కరిగిపోయి తానుగూడ “ఆడజన్మ మేమున్నదమ్మ! అధమపుజన్మ” అంటూ లలితను ఓదార్చింది.

౪

శంకరంపంతులుగారు పగలు పదిగంటల వేళ సావిట్లో పచారుచేస్తుండగా తపాలాజవాను వచ్చి రిజిస్టరుకవ రొకటి యిచ్చి రశీదుమీద చేవ్రాలు చేయించుకుపోయినాడు. ఆకవరు చించిచూడగా

“మీరు మీకొమార్తెకు మే మెన్నివిధముల వద్దని చెప్పినా మాయిష్టం లేకుండా విశాఖపట్నం పంపించి చదువుచెప్పిస్తున్నారు గనుక నేను యీనెల ౧౦ వ తేదీని ద్వితీయవివాహం చేసుకుంటున్నాను. కనుక తెలియపఱచడమైనది.

జి. జగన్నాథరావు”

అని వ్రాసి ఉన్నది. ఆ ఉత్తరం చూచి “అయ్యో! అనుకున్నంతా అయిం దని ఒక్క కేకవేసి నేల మీ ద కూ ల బ డ్డా రు, శం క రం పంతులుగారు. “అయ్యో! అంటున్నారేమి” టని లోపలినుంచీ పరుగెత్తుకొచ్చి అన్నపూర్ణమ్మ “ఆ ఉత్తర మేమిటి? దుఃఖపడుతున్నా రెందుకు? మావాళ్లంతా క్షేమమూ?” అని గ్రుక్క త్రిప్పకుండా అడిగింది. శంకరం పంతులుగారు కళ్ల నీళ్లుకారుస్తూ “మళ్లీ పెండ్లిచేసుకుంటున్నానని అల్లుడు రిజిష్టరు ఉత్తరం వ్రాశాడు. చూడు, లలిత స్థితి యేమైందో” అని మళ్లీ దుఃఖపడ్డారు.

“అట్లాగా, వాళ్ల మాటలు నిజమా! ఈ ముష్టి బెదిరింపులు యెవరు యెరగ రనుకున్నాడో! ఆతల్లి వ్రాయించింది కాబోలు, ఈమాటంటే హడలిపోతామని!”

“బెదిరింపు లేమిటి? నిజము అయి ఉంటుంది. నెలరోజులనుంచీ వింటూనే ఉన్నా, మళ్లీ పెళ్లి ప్రయత్నంలో ఉన్నారని.”

“అయితే కానీండి. దుఃఖపడతా రెందుకు?”

“నాలుగువేలు పోసి అల్లుణ్ణి తెస్తే లలితగతి యిట్లా అయిందిగదా అని విచారం.”

“లలితకర్మాని కేమిటి? లోకంలో మొగుడు చచ్చినవాళ్లెందఱు? మొగుడు వదిలిపెట్టినవాళ్లెందఱు? వారిలో మనపిల్ల ఒక్కతె. పోనీండి, మూడోమగపిల్లవాడనుకుందాము. ఒకవేళ కాపురానికి పంపితేమాత్రము ఆ అత్తగారు సుఖంగా ఉండనిచ్చేనా? ఆ మొగుడు చక్కగా యేలుకోబోయేనా? పీడా వదిలింది.”

“మొదటినుంచీ నీపెళుసుమాటలే దానికాపురం పాడుచేసినాయి. నేను చెప్పలేమూ, వాళ్లకు యిష్టం లేనప్పుడు చదువుకుపంపితే తంటా వస్తుందని. విన్నావూ?”

“వినేదేమిటి? పిల్ల మనయింట్లో ఉండగా వారి అధికార మేమిటి? పిల్ల ప్రతితరగతీ తప్పకుండా పాసై

సవుతుంటే పంతులమ్మలందఱూ 'మీ అమ్మాయి తెలివైంది. క్షణంలో స్కూలుఫైనలు ప్యాసుచేసి వస్తుం'దంటే సరేనని పంపాము. ఈమూడు నెల్లూ గడిస్తే ఆతర్వాత ఒకరు పంపమన్నా పంపుతామా? ఇంతలో యేమి ముంచుకుపోయింది? ఆపిల్లవాడేమో కోయంబత్తూరులో చదువుతుండే. ఆమాత్రం వివేకం వాళ్లకుండ రాదూ?"

"వాళ్లకు చదువంటే గిట్టదాయె. ఏమి చేస్తాము? అందుకేగామా మన అమ్మాయని బాగా చదివించాకనే పెండ్లి చేద్దామంటిని. అదీ వినకపోతివి."

"అవును. చదువుకోసం కులహాని చేసుకుంటామా? పెండ్లి చేస్తే బాగుంటుందనుకున్నా. బి. ఏ. పరీక్ష యిచ్చినవాడుగదా, చదువంటే గిట్టకపోతుందా అనుకున్నా. వీళ్ల కిట్లా పొయ్యేకాలం వస్తుందని నాకేం తెలుసు?"

"ఇంతకూ దాని కాపురం చేతులారా చెడగొట్టాము."

"మీలో యింత మెతక ఉండబట్టే వాళ్లట్లా యెగిరిపడుతున్నారు."

"అవును. నాలో మెతకా, నీలో కటుకూ కాపురం యింతకు దెచ్చింది."

"అదే మీకున్నది. నాలో కటుకుండి నే నెవరి గొంతులు కోటికాను? ఎంతమాటంటే అంతమాటా అనడమే! కడుపునగన్న బిడ్డమీద నాకేమన్నా పగా? చక్కగా అత్తవారింట్లో కాపురం చేస్తుంటే చూడలేకపోయినానా? పరాయమ్మ గన్నబిడ్డను నేను అగపడ్డాను, నానామాటలు పడడానికి. బిడ్డమీద అంత ఆపేక్ష కలవాళ్లయితే చదువు మాన్పించి తీసుకుపోయి అత్తవారింట్లో దిగపెట్టిరాండి. మూడురోజుల్లో ఏబావిలో పడ్డదనో, ఏసుడ్డకు నిప్పంటించుకున్నదనో, ఏగొంతుకు ఉరేసుకున్నదనో వర్తమానం వస్తుంది. మీచిక్కు తీరుతుంది. అంతకంటె ఆ అత్తగారివద్ద బతికి కాపురం చేయనా?"

"ఛీ! అప్రాచ్యురాల! నోరుమూయి. నీవు మంచి దానివా? ఆమె చెడ్డదా? ఇద్దఱూ ఇద్దఱే. రాతికుండా యినపతెడ్డూ. ఇద్దఱివల్లే దాని కాపురం చెడ్డది." అంటూ శంకరంపంతులుగారు కోపంతో వాకిట్లోకి వెళ్లిపోయినారు. అన్నపూర్ణమ్మ అక్కడే కూర్చొని యేడవటం మొదలుపెట్టింది.

జగన్నాథంలో మిగిలిఉన్న కొంచెం వివేచనా శక్తి లలితవద్దకు వెళ్లివచ్చినతరువాత నశించిపోయింది. ఇప్పుడు అతనిలో ఘనీభవించిందంతా, "నాకేమి? నేను మగవాడిని. నే నేమి చేస్తే చెల్లదు?" అనే అహంకారం. ఈగర్వంచేత గ్రుడ్డివాడైపోయిన జగన్నాథం తల్లి చేసిన యేర్పాటుల కన్నిటికీ వప్పుకున్నాడు. పెండ్లి నిశ్చయమైంది.

* * * *

పెండ్లిపీటలమీద చూచాడు, రెండోపెళ్లాన్ని జగన్నాథం. నల్లని మొద్దు, దిబ్బముఖం. పెద్దపెద్ద పెదవులు. అంగుళం వెడల్పు నుదురు. కనుబొమ్మలు, తలవెంట్రుకలు ఇంచుమించుగా కలిసిపోయినాయి. జగన్నాథం ఆవధువును చూచి ముఖ మింతచేసుకున్నాడు. విద్యా, వివేకం, సౌజన్యం, సౌందర్యం తాండవిస్తూఉన్న లలితసుందరముఖారవిందం ఒక్కమాటు జ్ఞాపకం వచ్చింది. మాణిక్యాన్ని పోగొట్టుకొని మసిపాతను కట్టుకున్నా ననిపించింది. తానీపెండ్లాడటం అత్తవారికేదో పరాభవమనీ, భార్య కేదో శిక్షనీ అనుకున్నాడు గాని నిజంగా తానీ అనాకారిభార్యను పెండ్లాడటం తనకే పరాభవము, తనకే శిక్షయేమో అనిపించింది మనస్సుకు. ఇంతలో వచ్చి కుమ్మరిల్లినవి, అయిదుసంచులూ, అంతేనా, వెండిపళ్లెం, బంగారపుచెంబు, జరీపట్టుబట్టలు, రవ్వలఉంగరము వగైరాలు—భార్య నేమిచూస్తావు? మావంక చూడవోయి! మేమంతా నిన్ను చుట్టి కొలుస్తుంటే భార్యఅందవికారాలు నీకేమి లోటుగలిగిస్తుంది? లోటుంటే సర్వస్వతంత్రంగల నీకు తీర్చుకొనే దారులు లేవా? అని పలకరిస్తూ. 'భార్యవివేకవతిఐతే నిన్ను అతి

క్రమిస్తుంది. రూపవతి ఐతే నిన్ను వెక్కిరిస్తుంది. చూడు, ఈభార్యవల్ల నీ కీరెండుఅపాయాలూ లేవు. 'ఎక్కడున్నావు గొంగళీ అంటే వేసినచోటుననే ఉన్నాను కంబళీ' అంటుంది. ఎంతలాభమోయి!' అంటూ వచ్చి నిలిచినాయి. ఈవిలువైన వస్తువుల వోదార్పుచేత భార్య మొద్దూ మొకరమూ అన్నవిచారం మఱచిపోయి మూడుముళ్లు వేశాడు, జగన్నాథం. శాస్త్రం ఒప్పుకున్నది. సంఘం సమ్మతించింది. పండితులు వేషని మెచ్చి ఆశీర్వదించి సంభావనలు పుచ్చుకొని దప్పళాలు కొట్టి వచ్చారు. అయితే నిరపరాధయైన లలితగతేమిటి?

కొందరు ఉద్యోగులు (నా యూహా ప్రపంచమున)